ఆకాశవాణి  హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేదీ:  28.11.2024                                        సమయం. 19.05 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రముఖ వ్యాపార సంస్థకు వ్యతిరేకంగా దాఖలైన లంచం ఆరోపణలతో పాటు వివిధ సమస్యలపై ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించడంతో పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.
2. జార్ఖండ్ ముఖ్యమంత్రిగా జార్ఖండ్ ముక్తి మోర్చా సీనియర్ నేత హేమంత్ సోరెన్ ఈరోజు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేశారు.
3. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన ను అమలు చేయడం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా ఈరోజు అగ్రహం వ్యక్తం చేశారు.
4. ఇ-శ్రమ్ పోర్టల్‌లో 30 కోట్ల 40 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు.

**PAR-ADJOURN:**

ప్రముఖ వ్యాపార సంస్థకు వ్యతిరేకంగా దాఖలైన లంచం ఆరోపణలతో పాటు వివిధ సమస్యలపై ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించడంతో పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఇతరులు ఈ వ్యాపార వర్గంపై నమోదైన లంచం ఆరోపణలతో సహా పలు సమస్యలను ప్రస్తావించడంతో గందరగోళం నెలకొంది. తొలుత మొదటి వాయిదా తర్వాత రాజ్యసభ 12 గంటలకు తిరిగి సమావేశమైనప్పుడు, కాంగ్రెస్, లెఫ్ట్, డిఎంకె, టిఎంసి, ఎస్‌పి, ఆప్, ఇతర సభ్యులు సమస్యలను లేవనెత్తి నినాదాలు చేశారు. దీంతో

రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రతిపక్ష సభ్యులను తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చోవాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. కాగా, లోక్ సభ లో మొదటి వాయిదా అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు సభ సమావేశమైనప్పుడు సభలో గందరగోళం కొనసాగింది. విపక్ష సభ్యులు పలు సమస్యలపై నినాదాలు చేస్తూ వెల్ లోకి దూసుకెళ్లారు. సభ్యులు సంయమనం పాటించి వారి వారి స్థానాల్లో కూర్చోవాలని సభాపతి కోరినప్పటికి వారు తమ నిరసనను కొనసాగించారు. దీంతో సభను రేపటికి వాయిదా వేయాల్సి వచ్చింది. సభలో విపక్షాల తీరును పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. కాగా, వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ జగదాంబికా పాల్ తమ కమిటీ నివేదికను సమర్పించడానికి గడువును బడ్జెట్ సెషన్, 2025 చివరి రోజు వరకు పొడిగించాలని కోరుతూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. అంతకుముందు, ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ నేతలు ప్రియాంక గాంధీ వాద్రా, రవీంద్ర వసంతరావు చవాన్‌లు లోక్‌సభలో పార్లమెంటు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

## PM- CULTURE

భారతదేశ చరిత్ర, సంస్కృతి పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉత్సాహం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు. భారతీయ సంస్కృతి ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోందని ఆయన సామాజిక మాధ్యమ పోస్ట్ లో పేర్కొన్నారు. తన విదేశీ పర్యటనల విశేషాలను పంచుకుంటూ, మన చరిత్ర, సంస్కృతి పట్ల ఈ అపారమైన ఉత్సాహం చాలా సంతోషాన్ని కలిగిస్తోందని ప్రధాన మంత్రి అన్నారు.

## REV EVE. JHARKHAND CM - SWEARING-IN

జార్ఖండ్ ముఖ్యమంత్రిగా జార్ఖండ్ ముక్తి మోర్చా సీనియర్ నేత హేమంత్ సోరెన్ ఈరోజు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మధ్యాహ్నం రాంచీలోని మోరబాది మైదాన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ సోరెన్‌తో ప్రమాణ స్వీకారం

చేయించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మలికార్జున్ ఖడ్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో సహా పలువురు ఇండి కూటమి నాయకులు హాజరయ్యారు. అలాగే సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ సీనియర్ నేత తేజస్వీ యాదవ్, సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా హాజరయ్యారు. కాగా, అసెంబ్లీలో విశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. విశ్వాస పరీక్ష అనంతరం మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది. **81** మంది సభ్యుల అసెంబ్లీలో, ఇండి కూటమి **56** సీట్లు సాధించింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే **24** సీట్లు గెలుచుకుంది. ఒక సీటు జార్ఖండ్ లోక్తాంత్రిక్ క్రాంతికారి మోర్చాకు లభించింది.

## PM SURYAGHAR

**PM-Surya Ghar Muft Bijli Yojana** కింద పైకప్పు సౌరశక్తి వ్యవస్థ స్థాపనలో గుజరాత్ ముందుంది. ఈ పథకం కింద ఇన్స్టాలేషన్స్ కోసం దేశంలో దాదాపు **26** లక్షల దరఖాస్తులు వచ్చాయని, **6** లక్షల **16** వేలకు పైగా ఇన్‌స్టాలేషన్‌లు పూర్తయ్యాయని కొత్త, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి శ్రీపాద్ నాయక్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. **2** లక్షల **81** వేలకు పైగా ఇన్‌స్టాలేషన్‌లతో గుజరాత్ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అగ్రగామిగా ఉంది. మహారాష్ట్రలో **1** లక్షా **20** వేలకు పైగా ఇన్‌స్టాలేషన్‌లు జరిగాయని ఆయన తెలిపారు. కేరళ, ఉత్తరప్రదేశ్‌లలో **51** వేలకు పైగా రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్‌లు ఏర్పాటయ్యాయి. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు దేశంలోని గృహ వినియోగదారులందరికీ అవకాశం ఉంది. జాతీయ పోర్టల్ **www.pmsuryaghar.gov.in**లో ఈ పథకం కింద రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఇన్‌స్టాలేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

**NADDA- DELHI GOVT**

ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన ను అమలు చేయడం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా ఈరోజు అగ్రహం వ్యక్తం చేశారు. ఆప్ ప్రభుత్వం ఈ పథకాన్ని ఉద్దేశపూర్వకంగా నగర ప్రజలకు దూరం చేసిందని నడ్డా సామాజిమక మాధ్యమంలో విమర్శించారు. ఢిల్లీలోని 6.5 లక్షలకు పైగా అర్హత ఉన్న కుటుంబాలకు, 70 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పౌరులందరికీ ఈ కీలకమైన ఆరోగ్య రక్షణ పథకం అందవసి ఉండగా దాన్ని ఆప్ ప్రభుత్వం తిరస్కరించిందని ఆయన ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాస్వామిక ప్రభుత్వాలు ప్రజలకు ఆసరా, సేవలు అందించే పథకాలను అమలు చేయాలన్నా కేంద్రం వైఖరికి ఇది విరుద్ధంగా ఉందని నడ్డా అన్నారు. ప్రతి లబ్దిదారుని కుటుంబానికి, 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఐదు లక్షల రూపాయల వరకు ఉచిత ఆరోగ్య రక్షణను అందించే **AB-PMJAY**ని కేంద్రం అమలు చేస్తోందని ఆరోగ్య శాఖ మంత్రి తెలిపారు.

**GOYAL – CII**

ఈ పోర్టల్ కేంద్ర ప్రభుత్వం, **CII** ల నుంచి సులభతర వాణిజ్యంపై కీలక కార్యక్రమాల తాజా సమగ్ర సమాచారాన్ని అందిస్తుంది. వినియోగదారులు పలు విషయాలను ఈ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు. న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో గోయల్ మాట్లాడుతూ... ప్రభుత్వ జాతీయ ఏక గవాక్ష వ్యవస్థ వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరిచిందని, వివిధ రంగాలు, పరిశ్రమలు, విభాగాలను ఏకతాటిపైకి తెచ్చిందని అన్నారు.

**E-SHRAM:**

ఇ-శ్రమ్ పోర్టల్‌లో **30** కోట్ల **40** లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఈరోజు రాజ్యసభలో లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో మంత్రి - దేశంలోని అసంఘటిత

కార్మికులకు మద్దతు ఇవ్వడంలో ప్రభుత్వ నిబద్ధతను ఇది రుజువు చేస్తుందన్నారు. ఏ అసంఘటిత రంగ కార్మికుడైనా ఇ-శ్రమ్ పోర్టల్‌లో స్వీయ-ప్రకటన ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని మంత్రి చెప్పారు.

## ROHIT- INDIA AUSTRALIA

భారత క్రికెటర్ కెప్టెన్ రోహిత్ శర్మ ఈరోజు ఆస్ట్రేలియన్ పార్లమెంట్ వద్ద మాట్లాడారు. తన ప్రసంగంలో ఆయన భారత్, ఆస్ట్రేలియా మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయని కొనియాడారు. భారత క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. కాన్‌బెర్రాలోని ఫెడరల్ పార్లమెంట్ హౌస్‌లో ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌ను భారత జట్టు కలుసుకుంది. ఈ ఉదయం పెర్త్ నుంచి భారత జట్టు కాన్ బెర్రా చేరుకుంది. వారు శనివారం మనుకా ఓవల్‌లో ప్రైమ్ మినిస్టర్స్ **XI**తో డే అండ్ నైట్ మ్యాచ్ ఆడతారు. పెర్త్ లో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో ఆస్ట్రేలియాపై భారత్ 295 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది.

## EVE. SYED MODI BADMINTON TOURNAMENT

బ్యాడ్మింటన్‌లో, లక్నోలో జరుగుతున్న సయ్యద్ మోదీ ఇండియా ఇంటర్నేషనల్ 2024 సూపర్ 300 టోర్నమెంట్‌లో ప్రముఖ క్రీడాకారిణులు పివి సింధు, ఉన్నతి హుడా, శ్రీయాన్షి వలిశెట్టి మహిళల సింగిల్స్ క్వార్టర్-ఫైనల్‌లోకి ప్రవేశించారు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన సింధు ఈరోజు రౌండ్ ఆఫ్ 16లో స్వదేశానికి చెందిన ఇరా శర్మను 21-10, 12-21, 21-15తో ఓడించించారు. మరో మ్యాచ్‌లో ఉన్నతి హుడా 21-18, 22-20తో థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్ పిచా చోయికీవాంగ్‌ను శ్రీయాన్షి వలిశెట్టి 21-12, 21-15తో రెండో సీడ్ మాళవిక బన్సోడ్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. పురుషుల సింగిల్స్ లో లక్ష్యసేన్, ప్రియాంషు రజావత్, మీరాబా లువాంగ్ మైస్నమ్, ఆయుష్ శెట్టి కూడా క్వార్టర్ ఫైనల్ లోకి

ప్రవేశించారు.